జగిత్యాల టౌన్: జేసీబీ సహాయంతో ప్రజలను వాగు అవతలి వైపు దాటిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

మల్యాల: మండల కేంద్రంలో మత్తడి దుంకుతున్న పెద్ద చెరువు

భారీ వర్షం

జగిత్యాల టౌన్, ఆగస్టు 30: జిల్లా కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలైన పోచమ్మవాడ, టవర్‌సర్కిల్, మహాలక్ష్మీనగర్, తులసీనగర్, సారుగమ్మవీధి, గాంధీనగర్, ఖిలగడ్డ, నిజామాబాద్ రోడ్డు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో నీరు ఇండ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని గోవిందుపల్లె వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో వాగు అవతలి వైపు ఉన్న వెంకటాద్రినగర్‌కు సంబంధాలు తెగిపోయాయి. అత్యవసర పని ఉన్న వారిని జేసీబీ సాయంతో వాగు దాటిస్తున్నారు. అలాగే, జగిత్యాల పట్టణ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద గల లో లెవెల్ వంతెనపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో గొల్లపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులు మోతె మార్గంలో రాకపోకలను మళ్లించారు.

మల్లాపూర్, ఆగస్టు 30: మల్లాపూర్ మండల కేంద్రం శివారులోని ఆదర్శ పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిపై నుంచి వరద నీరు ప్రవహించడంతో విద్యార్థులు ఒకరినొకరు పట్టుకొని ఇబ్బందులు పడుతూ వెళ్లారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రధాన రహదారిపై నుంచి వరద నీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మేడిపల్లి, ఆగస్టు 30: మేడిపల్లి, భీమారం మండలాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో మేడిపల్లి, కొండాపూర్, విలాయతాబాద్, కాచారం, వెంకట్రావుపేట, ఒడ్యాడ్, వల్లంపల్లి గ్రామాల శివారులోని లో లెవల్ వంతెనలపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో రైతులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కమ్మరిపేటలో లో లెవల్ బ్రిడ్జిపై నుంచి వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

మల్యాల, ఆగస్టు 30: మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో చెరువులు మత్తడి దుంకుతున్నాయి. కాగా, సర్వాపూర్‌తో పాటు గొల్లపల్లె గ్రామంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో భారీగా వరద నీరు నిలిచింది.

ధర్మపురి నర్సన్న సన్నిధిలో విప్ పూజలు

ఆలయంలో పూజలు చేస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 30: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న విప్‌కు దేవస్థాన సిబ్బంది సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో పండితులు మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వదించారు. పూజల అనంతరం దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు రమణయ్య, నంబి నరసింహమూర్తి, నాయకులు జక్కు రవీందర్, వేముల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, లక్ష్మీనరసింహస్వామిని జిల్లా అటవీశాఖ అధికారి రవిప్రసాద్ దర్శించుకొని, పూజలు నిర్వహించారు. అటవీశాఖ అధికారి దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం అందజేసి సన్మానించారు.

ఎల్వోసీ అందజేత

జగిత్యాల, ఆగస్టు 30: తక్కలపల్లి గ్రామానికి చెందిన బోనగిరి గంగయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ రూ. 2.50 లక్షల ఎల్వోసీ మంజూరు చేయించారు. కాగా, పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గంగయ్యకు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఎల్వోసీ పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం నారాయణ రెడ్డి, మహేశ్వర రెడ్డి, సత్తిరెడ్డి, కౌన్సిలర్లు రాజ్ కుమార్, కూతురు రాజేశ్, నాయకులు సత్యం, రాజు, ప్రవీణ్ రావు, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వైద్య పరీక్షలు

జగిత్యాల, ఆగస్టు 30: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి వృద్ధాశ్రమంలో శుక్రవారం వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు శ్రీనివాస్, నాగలింగం, ఆశ్రమం నిర్వాహకులు కాలగిరి బాపురెడ్డి, డాక్టర్ చంద్రమౌళి, ఎలిమిల్ల సత్తయ్య, రంగు రాజయ్య, గుండేటి రాజు, మేనేజర్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

జగిత్యాల రూరల్, ఆగస్టు 30: జగిత్యాలలోని మైనార్టీ స్కూల్లో శుక్రవారం మహిళా సాధికారత కేంద్ర బృందం ఆధ్వర్యంలో బేటీబచావో–బేటీపఢావో కార్యక్రమం, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుచిత్ర, మహిళా సాధికారత బృందం సభ్యులు స్వప్న, కైలాస్, సత్యర్థి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సర్కారు కృషి

భజన మందిర నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, ఆగస్టు 30, (నమస్తే తెలంగాణ): ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని బ్రాహ్మణవాడ శ్రీరామ మందిరం ఆవరణలో టీటీడీ నిధులు రూ. 10 లక్షలతో చేపడుతున్న భజన మందిరం నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయాల అభివృద్ధి, భారతీయ సంస్కృతీసంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో 9 ఆలయాలకు టీటీడీ నుంచి నిధులు మంజూరైనట్లు చెప్పారు. మరికొన్ని ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ జయశ్రీ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు టీవీ సూర్యం, తీగుళ్ల సూర్యనారాయణ శర్మ, బ్రాహ్మణ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన ఉద్యోగ సంఘాల నాయకులు

'విజయవంతం చేయాలి'

జగిత్యాల టౌన్, ఆగస్టు 30: రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా జేఏసీ చైర్మన్ బోగ శశిధర్, కార్యదర్శి గంగుల సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ భాగస్వామ్య సంఘాల ప్రతినిధులతో జిల్లా ఇరిగేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ బోగ శశిధర్ మాట్లాడుతూ, సీపీఎస్‌కు నిరసనగా సెప్టెంబర్ ఒకటిన పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం నుంచి తహసీల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించాలన్నారు. ఈ ర్యాలీలో జేఏసీ భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్‌రెడ్డి, టీజీవో జిల్లా కార్యదర్శి మామిడి రమేశ్, పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రయ్య, సీపీఎస్ ఈయూ అధ్యక్షుడు గంగాధరి మహేశ్, సర్వ సతీశ్, మ్యాన పవన్, మహేశ్, నాయకులు రవిబాబు, డాక్టర్ రాజేందర్‌రెడ్డి, రవీందర్, మధుకర్, గణేశ్, ఉపాధ్యాయ సంఘం నాయకులు మచ్చ శంకర్, గంగనర్సయ్య, బోగ రమేశ్, మల్లారెడ్డి, తుంగూరి సురేశ్, శ్రీనివాస్‌గౌడ్, హరికిరణ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంతోష్, శ్రీనివాస్, పూర్ణచందర్, ఆనంద్, రాజ్‌కుమార్, అశోక్‌కుమార్, ముజాహిద్‌ఖాన్, సంతోష్, నసీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల సందర్శన

మొక్క నాటుతున్న డీఐఈవో, అధ్యాపకులు

రాయికల్, ఆగస్టు 30: రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు సందర్శించారు. కళాశాల ఉపన్యాసకులు, విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు ఉందం రాజేశ్, ఉపన్యాసకులు మనోహర్ రెడ్డి, డారపు శ్రీనివాస్, రాజమౌళి, దేవేందర్, రాషేంద్రప్రసాద్రి, రవీందర్, రహీం, రాజేశ్వర, శ్రీనివాస్, గంగారెడ్డి, గంగాధర్, రాజగోపాల్, రజిత, ఉషారాణి, సద్దబా, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

మల్లాపూర్, ఆగస్టు 30: పంట రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సోమేశ్వర కొండ వద్ద శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 2 లక్షల రుణమాఫీ వందశాతం అమలు చేస్తామని చెప్పారు. అనంతరం పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడు అయ్యోరి దశరథం, మాజీ మండలాధ్యక్షుడు సిరిపురం రవీందర్‌తో పాటు పలు గ్రామాల పద్మశాలీ సంఘాల సభ్యులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ వెంకట్, జలపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నల్ల బాపురెడ్డి, నల్ల రాజన్న, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లయ్య, ఆనంద్‌గౌడ్, నారాయణ రెడ్డి, రాజరెడ్డి, రాజం, భూమయ్య, రాజేందర్, సురేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్, ఆగస్టు 30: మండలంలోని కిష్టంపేట్ గ్రామానికి చెందిన బొంతల వెంకట్ రెడ్డి ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన ఆకుల అంజయ్య గౌడ్‌కు శస్త్ర చికిత్స కాగా, గాజెంగి శశాంక్ అనారోగ్యంతో బాధపడుతుండగా వెళ్లి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే, రాజనగరం గ్రామానికి చెందిన కొమ్ముల రాజేశ్వర్ రెడ్డి ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఉప్పుమడుగు సింగిల్ విండో చైర్మన్ దీటి రాజిరెడ్డి, నాయకులు రాజన్న, తిరుపతి గౌడ్, జాన గంగాధర్, జాన గోపి, చీలుక శ్రీనివాస్, ముల్క గంగనర్సయ్య, శేఖర్, సళ్ల శేఖర్ గౌడ్, సళ్ల శంకర్, కట్ట సురేశ్, ఆదిరెడ్డి, నాగరాజు, సత్తవ్వ, లచ్చవ్వ, తదితరులున్నారు.

మూఢనమ్మకాలను వీడాలి

మల్యాల, ఆగస్టు 30: ప్రజలు మూఢనమ్మకాలను వీడనాడాలని నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు నీరజ అధ్యక్షతన 'మహిళల రక్షణ–మూఢనమ్మకాల'పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో మూఢనమ్మకాలపై ఇంద్రజాల ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.

సాయిరామ ఆలయ హుండీ లెక్కింపు

కోరుట్ల, ఆగస్టు 30: పట్టణంలోని సాయిరామ ఆలయ హుండీల లెక్కింపు దేవాదాయ, ధర్మదాయ శాఖ పర్యవేక్షకుడు రాజమొగిలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. రూ. 5 లక్షల 9,726 నగదు, మిశ్రమ వెండి కిలో 600 గ్రాములు సమకూరినట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. ఇక్కడ ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు ఉన్నారు.

పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా అశోక్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30: పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా జెంగిలి అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు యాల్ల అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా నవీన్‌కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఇప్పత్ యాస్మిన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి బోయినపల్లి ఆనంద్‌రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర బాధ్యులు చిన్నయ్య, శ్రీధర్, గణేశ్, రాజ్‌కుమార్, జనార్దన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిందీ పుస్తకాల పంపిణీ

మేడిపల్లి, ఆగస్టు 30: కల్వకోట గ్రామానికి చెందిన లింగంపల్లి భరత్–దీపిక దంపతుల కూతురు లిషిత జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హిందీ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదె లక్ష్మీరాజం, మాజీ ఉపసర్పంచ్ బన్నా రాజేందర్ ప్రధానోపాధ్యాయుడు సురేందర్, ఉపాధ్యాయులు గంగాధర్, మహేశ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎండీ గాజీపాషా, కారోబార్ మమత ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీడీపీవో

జగిత్యాల, ఆగస్టు 30, (నమస్తే తెలంగాణ): ఐసీడీఎస్ జగిత్యాల ప్రాజెక్టు సీడీపీవోగా బాధ్యతలు స్వీకరించిన మమత శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రాజెక్టు పరిధిలో ప్రభుత్వ నిర్దేశిక స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని, పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు.

క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

వెల్గటూర్, ఆగస్టు 30: ఎండపల్లి మండలం మారేడుపల్లి శివారులోని క్వారీలో ఇటీవల మృతిచెందిన బీహార్ కార్మికుడు కుందన్‌కుమార్ కుటుంబానికి రూ. 30 లక్షల పరిహారం ఇవ్వడంతోపాటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొంకూరి కైలాసం శుక్రవారం ఉమ్మడి జిల్లా కార్మిక శాఖ అధికారి కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. ఇక్కడ అంబాల నరేశ్, అలువాల ప్రశాంత్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కథలాపూర్, ఆగస్టు 30: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సింధూజ పేర్కొన్నారు. మండలంలోని చింతకుంట, తక్కళ్లపెల్లి గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు హిరణ్మయి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, సునీత, ఏఎన్ఎంలు గంగామణి, రజిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జగిత్యాల రూరల్, ఆగస్టు 30: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో గల శక్తి గణపతి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం, పసుపు బొట్టు కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్, ఆగస్టు 30: శ్రావణమాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని పట్టణంలోని మహాలక్ష్మి అమ్మవారిని భక్తులు దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి, ఆగస్టు 30: ఆరవల్లి గ్రామంలోని నాయకురాలు దేవత ఆలయానికి శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ ఉప్పులంచ లక్ష్మణ్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

జగిత్యాల రూరల్, ఆగస్టు 30: తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని శుక్రవారం జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు మహార్యాలీ, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అప్పటి వరకు బేసిక్ టైమ్ స్కేల్‌తో పాటు జీవిత బీమా రూ. 10 లక్షలు, ఆరోగ్య బీమా రూ. 5 లక్షల సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బర్ల నారాయణ, గౌరవాధ్యక్షుడు అనుమల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కుడుకల రవీందర్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్టాండ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 30: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. వెల్లుల గ్రామంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఇండ్లల్లో నిల్వ ఉంచుకున్న పనికిరాని వస్తువులను తొలగింపజేశారు. చెత్తను ఆరుబయట వేయవద్దని, గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లోనే వేయాలని, ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని సూచించారు. చెత్తను బయట వేసిన వారికి రూ. 500 నుంచి రూ. వెయ్యి వరకు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, కార్యదర్శి నారాయణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మేడిపల్లి, ఆగస్టు 30: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మాజీ సర్పంచ్, దాక్షాయిని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు కరండ్ల మధుకర్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమారం మండలం గోవిందారం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆయన రూ. 10 వేల విలువైన ట్రాక్ షూట్‌లు, స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేశారు. అనంతరం కరండ్ల మధుకర్‌ను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు హసేక్ హుస్సేన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కవిత, శోభన్, సభ్యులు సురేశ్, తిరుపతి, నవీన్, రాజేందర్, శేఖర్, రాజేశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

మల్యాల, ఆగస్టు 31: మండలంలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని ఎస్ఐ నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. గణేశ్ ఊరేగింపులో డీజే సౌండ్‌కు అనుమతి లేదని, రహదారులకు అడ్డుగా గణేశ్ మండపాలను ఏర్పాటు చేయవద్దని కోరారు.

కొడిమ్యాల, ఆగస్టు 30: గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ సందీప్ సూచించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మండపాల నిర్వాహకులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. పోలీసులకు మండపాల నిర్వాహకులు సహకరించాలని కోరారు.

రైతులందరికీ పంట రుణమాఫీ చేస్తాం

మేడిపల్లి, ఆగస్టు 30: రైతులందరికీ పంట రుణమాఫీ చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాంకేతిక కారణాలతో పంట రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన రైతులందరికీ పంట రుణమాఫీ చేసే బాధ్యత తమదని, రైతును రాజు చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఏనుగు రమేశ్‌రెడ్డి, నాయకులు మార్గం నర్సారెడ్డి, దాసరి శంకర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపతి దామోదర్, గంగారాజం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల వారీగా ఓటర్ల జాబితా సవరణ

పెగడపల్లి, ఆగస్టు 30: స్థానిక సంస్థలకు ప్రభుత్వం త్వరలో ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు సంబంధించి శుక్రవారం నుంచి వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సవరిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వార్డుల వారీగా ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ

రాయికల్, ఆగస్టు 30: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అవుతుందని జిల్లా వ్యవసాయాధికారి వాణి పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద రేషన్ కార్డు లేని రుణమాఫీ అర్హత కలిగిన కుటుంబాల వివరాల నమోదు సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించారు. రేషన్ కార్డు లేని అర్హత కలిగిన కుటుంబాల వివరాలను సేకరించి రుణమాఫీ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ముక్తేశ్వర్, ఏఈవోలు నరేశ్, పద్మావతి, సృజన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం

కోరుట్ల రూరల్, ఆగస్టు 30: ఏకీన్‌పూర్ గ్రామంలో నిర్మించిన బేతాల స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన బోర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తిరుమల గంగాధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, నాయకులు అనిల్, శీలం వేణుగోపాల్, ఆడెపు మధు, సేనాపతిరాజు, వెంకటి, మురళి పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

మల్లాపూర్, ఆగస్టు 30: గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వీరసింగ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, కమర్షియల్ ట్రాక్టర్లు మాత్రమే అనుమతి తీసుకొని ఇసుక రవాణా చేయాలని, ప్రతి ట్రాక్టర్‌కు రెండు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇసుక అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే మొదటి సారి రూ. 25 వేలు జరిమానా విధిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ కిరణ్‌కుమార్, ఆర్ఐ సురేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కొడిమ్యాల, ఆగస్టు 30: పూడూర్ గ్రామంలో పారిశుధ్య పనులను శుక్రవారం అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి పరిశీలించారు. రోడ్లపై వరద నీరు నిలిచి ఉండకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రైమరీ పాఠశాలను సందర్శించారు. భవనం శిథిలావస్థలో ఉండగా, విద్యార్థులను వేరే చోటికి మార్చాలని సూచించారు. బీఎల్వోలు చేపట్టిన ఓటరు సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఇనుగొండ స్వరూప, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు

మల్లాపూర్, ఆగస్టు 30: ఉద్యోగులు అంకిత భావంతో పని చేస్తేనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీడీవో రాజేందర్‌రెడ్డికి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా, అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఎంపీడీవోను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మనోహర్‌రెడ్డి, జడ్పీ సీఈవో రఘువరన్, ఆర్డీవో శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

రాయికల్, ఆగస్టు 30: గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ రఘుచందర్ సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం మండలంలోని వివిధ యువజన సంఘాల సభ్యులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రఘుచందర్ మాట్లాడుతూ, గణేశ్ నిమజ్జనంలో డీజే వినియోగించవద్దని, మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపం వివరాలను పోలీసు అధికారులకు సమర్పించాలన్నారు. పోలీసులకు యువత సహకరించాలని సూచించారు. విద్యుత్, పంచాయతీ, పురపాలిక అధికారులతో సమన్వయం చేసుకొని నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తామన్నారు. కార్యక్రమంలో జగిత్యాల రూరల్ సీఐ వై కృష్ణారెడ్డి, ఎస్ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశవాణిలో నందగిరి కళా బృందం పాటల ప్రదర్శన

పెగడపల్లి, ఆగస్టు 30: పెగడపల్లి మండలం నందగిరి గ్రామానికి చెందిన పెద్దమ్మ తల్లి జానపద కళాబృందం సభ్యులు ఆకాశవాణి రేడియోలో ఎల్లమ్మ తల్లి, జానపద పాటలను ఆలపించారు. ఈ నెల 29న హైదరాబాద్‌లోని ఆకాశవాణి రేడియో కేంద్రంలో బృందం సభ్యులు ఐతరవేణి సుగుణమ్మ, బక్కవ్వ, ఐలవేని మల్లవ్వ, నర్సవ్వ, రాజవ్వ, సత్తవ్వ జానపద పాటలు పాడి అలరించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులను పలువురు అభినందించారు.

లోకమాత పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

జగిత్యాల, ఆగస్టు 30: జిల్లా కేంద్రంలోని పురాణిపేటలో లోకమాత పోచమ్మ ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు సోమవారం వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారిని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి దర్శించుకొని, పూజలు చేశారు. ఉత్సవాల్లో కౌన్సిలర్ లలిత, మాజీ కౌన్సిలర్ రాజేందర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రుణమాఫీ సర్వే ప్రారంభం

కథలాపూర్, ఆగస్టు 30: కథలాపూర్ మండలం సిరికొండలో శుక్రవారం వ్యవసాయాధికారులు పంట రుణమాఫీ సర్వే చేశారు. రైతుల ఆధార్‌కార్డు, పట్టా పాసు పుస్తకాల్లో వేర్వేరుగా పేర్లు నమోదైన వారి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శేఖర్, ఏఈవోలు సంధ్య, మౌనిక, రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

కోరుట్ల, ఆగస్టు 30: పట్టణంలోని రవీంద్ర రోడ్డు కాలనీకి చెందిన సబీనా బేగం అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స కోసం ఎల్వోసీ మంజూరు చేయించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన విప్ రూ. 2.50 లక్షల ఎల్వోసీ మంజూరు చేయించారు. కాగా, శుక్రవారం సబీనా బేగం కుటుంబ సభ్యులకు ఎల్వోసీ అందజేశారు.

కంటి వైద్య శిబిరం

వెల్గటూర్ ఆగస్టు 30: లయన్స్ క్లబ్ వెల్గటూర్ ఆధ్వర్యంలో ఎండపల్లి మండలం గొడిశెలపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 98 మందికి కంటి పరీక్షలు చేశారు. 35 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి, రేకుర్తిలోని కంటి దవాఖానకు రెఫర్ చేశారు.

సభ్యత్వ నమోదు

మల్లాపూర్, ఆగస్టు 30: మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులు వడ్డేపల్లి శ్రీనివాస్, గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర లక్ష్మి, నర్సారెడ్డి, రాజేందర్, రాములు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

మేడిపల్లి, ఆగస్టు 30: మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ సిరికొండ శ్రీనివాస్, కరీంనగర్ పార్లమెంట్ కో–కన్వీనర్ క్యాతం దశరథరెడ్డి, మండల కన్వీనర్ కాటిపెల్లి జగన్‌రెడ్డి, యువమోర్చా మండలాధ్యక్షుడు గోస్కి మధు, నాయకులు దాసరి రఘు, తోపారపు గణేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధర్మపురి, ఆగస్టు 30: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ దేవాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా, ఆసక్తి గల వారు దేవాదాయ శాఖ కమిషనర్ హైదరాబాద్‌కు గానీ, జాయింట్ కమిషనర్‌కు గానీ, వరంగల్ ఉప కమిషనర్‌కు గానీ, సహాయ కమిషనర్ కరీంనగర్‌కు గానీ దరఖాస్తు చేసుకోవాలని ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
అమ్మబడును
★కరీంనగర్ టవర్‌కు 1 కి.మీ దూరంలో బొమ్మకల్ వెళ్ళే రోడు గోదావరిఖని-హైదరాబాద్ హైవే దగ్గర వరహస్వామి గుడి వద్ద కృష్ణానగర్ చౌరస్తాలో 20 గజముల షట్టర్ షాపులు అమ్మబడును. సెల్: 95736 10777, 70590 68888.
NTK-325564
పేరు మార్చబడినది
నేను, **సందవేణి మహేష్** S/o. **కొమురయ్య,** R/o. Q.No: ST2-2044, 8 ఇంక్లైన్ కాలనీ, మం: రామగుండం, జి: పెద్దపల్లి, TG అను నా యొక్క పేరు ఇక నుండి **సందినేని మహేందర్** S/o. **కొమురయ్య** అని తెలంగాణ రాజపత్రం (No: 214) ద్వారా మార్చబడింది.
PLOT FOR SALE
★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189